





# స్టార్ త్రినేత్రం

PRGI NO : TGTEL /25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక



వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 278 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | శుక్రవారం, 27-3-2026 | పేజీలు: 4 | వెల: 2

WARANGAL VOL-1 ISSUE-278 Editor: D.SHIVAKRIHSNA FRIDAY, 27-3-2026 Pages: 4 Price: 2

Publised From Warangal: Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar & TG All Districts


# నేడు భద్రాద్రి సీతారాముల కళ్యాణం..

## మూడు తాళిబొట్లు, ఎర్ర తలంబ్రాల వెనుక ఉన్న ఆధ్యాత్మిక రహస్యాలు!

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

త్రేతాయుగంలో విళంబి నామ సంవత్సరం, చైత్ర శుద్ధ నవమి, పునర్వసు నక్షత్రం అభిజిత్ లగ్నంలో కౌసల్య దేవికి శ్రీరాముడు జన్మించాడు. రాముడు జన్మించిన చైత్రశుద్ధ నవమి తిథి శ్రీరామనవమిగా పిలువబడుతుంది. భద్రాద్రిలో జరిగే సీతారాముల కళ్యాణం ఎవరు వీక్షిస్తారో.. వారికి అశ్వమేధయాగ ఫలం సిద్ధిస్తుందని బ్రహ్మ పురాణం చెబుతుంది. నేడు జగదభిరాముని కళ్యాణానికి దక్షిణ అయోధ్య భద్రాద్రి సర్వాంగ సుందరంగా ముస్తాబయింది.

**పుట్టినరోజే కళ్యాణం..**

ఏ దేవుని అవతారం ఏ రోజు జరిగిందో.. అదే రోజు ఆ దేవుని కళ్యాణం నిర్వహించాలని పాంచారాత్ర ఆగమం చెబుతుంది. ఈ ఆగమ వచనాన్ని అనుసరించి భద్రాద్రిలో రామయ్య జన్మించిన రోజే కళ్యాణం నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ ఆచారానికి భక్త రామదాసు శ్రీకారం చుట్టగా, భద్రాచలం పుణ్యక్షేత్రంలో ఏ రోజు అయితే కళ్యాణం నిర్వహిస్తారో.. ప్రపంచ వ్యాప్తంగా అన్ని ఆలయాలలో సీతారాముల కళ్యాణం అదేరోజు నిర్వహిస్తారు. భద్రాద్రిలో శుక్రవారం జరిగే కళ్యాణంలో సీఎం రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. అలాగే శనివారం నిర్వహించనున్న రామయ్య మహా పట్టాభిషేకం కార్యక్రమానికి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా హాజరై పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ప్రముఖుల పర్యటన పురస్కరించుకుని 2 వేల మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

**ఎన్నెన్నో విశిష్టతలు..**

తానిషా మహా ప్రభువు భద్రాద్రిలో జరిగే రామయ్య కళ్యాణానికి ప్రతి సంవత్సరం గులాలు, పట్టు వస్త్రాలు పంపేవారు. ఇదే సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. ఇప్పటికి ప్రతి సంవత్సరం శ్రీరామనవమి నాడు భద్రాద్రిలో జరిగే స్వామివారి కళ్యాణానికి ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. ఇంకా స్వామి వారి కళ్యాణ మండపం విశిష్టత ఎనలేనిది. రామయ్య కళ్యాణ తలంబ్రాలను భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు.

**అపురూపం కళ్యాణ మండపం..**

ప్రతి సంవత్సరం శ్రీరామ నవమికి సీతారాముల కళ్యాణం మహోత్సవం మహా వైభవంగా జరుగుతుంది. లక్షలాది భక్తులు కన్నుల పండుగగా దర్శిస్తారు. ఆ కళ్యాణ మండపం అద్భుత శిల్ప కళాఖండం! అపురూప కమనీయ దృశ్య కావ్యం. 1960 సంవత్సరంలో ఈ మండప నిర్మాణం ప్రారంభమైంది. సుప్రసిద్ధ శిల్పాచార్యులు గణపతి స్థపతిచే ఈ మండపం నిర్మాణం జరిగింది. తమిళనాడు రాష్ట్రం దిండివనం గ్రామం నుండి ఆకుపచ్చ ధాతు రాయిని తెప్పించారు.

▶ మిగతా 2లో





# అమ్మో.. మళ్లీ కరోనా..!

- లాక్ డౌన్ తప్పదా..?
- 25 రాష్ట్రాల్లో కొత్త కేసులు ఆందోళన
- 130 మందికి పైగా కొత్త రకం నిర్ధారణ
- ప్రజల్లో మళ్లీ భయాందోళనలు

**స్టార్ త్రినేత్రం, అంతర్జాతీయం:**

అమెరికాలో మరోసారి కరోనా కలకలం రేపుతోంది. గత కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న పరిస్థితులు ఒక్కసారిగా మారిపోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దేశవ్యాప్తంగా దాదాపు 25 రాష్ట్రాల్లో కోవిడ్-19 లక్షణాలు వెలుగుచూస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఈ పరిణామంతో ఆసుపత్రుల వైపు ప్రజలు పరుగులు తీస్తుండగా, ఆరోగ్య వ్యవస్థ మళ్లీ ఒత్తిడిని ఎదుర్కొనే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా కోవిడ్-19కు చెందిన కొత్త రూపం వేగంగా వ్యాప్తి చెందుతుండటం అధికారులను అప్రమత్తం చేసింది. ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో సుమారు 130 మందికి పైగా ఈ కొత్త వేరియంట్ సోకినట్లు నిర్ధారణ కావడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.

ఈ కొత్త వేరియంట్ మూలాలు అంతర్జాతీయ ప్రయాణాలతో సంబంధం ఉన్నట్లు ఆరోగ్య నిపుణులు భావిస్తున్నారు. నెదర్లాండ్స్ నుంచి అమెరికాకు వచ్చిన ఒక వ్యక్తిలో తొలిసారిగా ఈ లక్షణాలు బయటపడటంతో విదేశీ ప్రయాణాల ద్వారానే వ్యాప్తి జరిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ కొత్త రకం సోకిన వారిలో జ్వరం, దగ్గుతో పాటు శరీరంలోని రోగనిరోధక శక్తి వేగంగా తగ్గిపోవడం ప్రధాన ఆందోళనగా మారింది. దీంతో బాధితులు ఇతర అంటువ్యాధులకు కూడా సులభంగా గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వ్యాప్తి ప్రజల్లో పాత జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేస్తోంది

▶ మిగతా 2లో

# రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

**దావోస్ పర్యటనపై సభలో మంత్రి శ్రీధర్ బాబు**

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**



2024, 2025 దావోస్ పర్యటనల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులను సముపార్జించిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం సభలో దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై బీజేపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. మొత్తం 44 ఎంవోయూలను వివిధ కంపెనీలతో కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. ఆయా పెట్టుబడుల గ్రౌండింగ్ వివిధ దశల్లో ఉన్నాయని, ఫలితంగా కొత్తగా 68,150 మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందని తెలిపారు.

▶ మిగతా 2లో

# ఎంఎంటీఎస్‌పై సీఎం రేవంత్ సమీక్ష..

## ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు మినీ బస్సులు!

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమం తప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులను నడపాలని ఆదేశించారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎంఎంటీఎస్‌లో ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ప్రధానంగా ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉండటంతో అక్కడకు రాకపోకలు



సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**మెరుగైన వసతులు కావాలి..**

మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు, వసతులు మెరుగుపరచడానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల మానసిక వేదనను దూరం చేసేలా సర్కార్ అడుగులు!



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ రాష్ట్ర శాసన మండలి హాల్‌లో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 0–10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం, విద్యాభ్యాస స్థాయి సామర్థ్య లోపాలకు సంబంధించిన పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ దృష్టికి తెచ్చారు. చిన్న వయసులో పోషకాహార లోపం వల్ల భవిష్యత్తులో తలెత్తే ఆరోగ్య సమస్యలు, ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన వివరించారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను సూచించారు.

**ప్రత్యేక శ్రద్ధ అవసరం..**

ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందించేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందించేందుకు "పోషణ సఖి" పేరుతో మరొకరిని నియమించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కార్తీక్ మురళీధరన్ సూచించిన అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌లలో ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కార్తీక్ మురళీధరన్‌తో సమన్వయం చేసుకుని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

# పీఆర్‌సీ గడువు మళ్లీ పొడిగింపు



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు మరోసారి నిరాశే మిగిలింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కమిషన్ గడువును ప్రభుత్వం పెంచింది. పీఆర్‌సీ గడువు సెప్టెంబర్ నెలాఖరు వరకు పొడిగించింది. ప్రస్తుత పీఆర్‌సీ కమిటీ గడువు మరో ఐదు రోజుల్లో (31 మార్చి)తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మరో 6 నెలల పాటు కమిటీ గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కొత్త పీఆర్‌సీ కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. కానీ కొత్త పీఆర్‌సీ నివేదిక ఇంకా ప్రభుత్వానికి చేరలేదు. ఈ తరుణంలో కొత్త పీఆర్‌సీ కోసం ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు.

▶ మిగతా 2లో

# ఒకే ఒక్క క్లిక్.. అరచేతిలో 'భూమి' సమాచారం!

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని, గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ (ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్)ను వచ్చే నెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఎన్ఐసీ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందికి తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి భూ లావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా పోర్టల్‌ను ఉంటుందన్నారు.



**రిజిస్ట్రేషన్‌కి మ్యాప్..**

ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ పైలెట్ మండలాల్లో మెరిట్–డీమెరిట్‌లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని, ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూ భారతి పోర్టల్‌ను కూడా తీసుకొచ్చామన్నారు. భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ మాదిరిగానే భూధార్ నంబర్‌ను ఇస్తామన్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షా లేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నంబర్లను కేటాయించినట్లు తెలిపారు.

**పూర్తి సమాచారంతో పోర్టల్..**

ఒక క్లిక్‌తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా, చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు.

▶ మిగతా 2లో

మొదటిపేజీ తరువాయి

భద్రాచల సమీపంలోని తాటాకుల గూడెంలో నుండి నల్ల రాయిని తెప్పించారు. శిల్పాచార్యుల నిర్మాణం దక్షతలో శిల్పుల చేతుల్లో శిలలు మైనమై పోయాయి. కళ్యాణ మండపం 31 చదరంలో ఉపోప పీఠంతో చేయబడింది. ఈ పీఠంపై వరుసలో 50 నడిచే ఏనుగులు చెక్కారు. ఉపో పీఠంపైభాగంలో పత్రోప పీఠం అమర్చారు. ఇది పద్మ దళాలతో కూడి ఉంటుంది.
దీనిని 'పద్మజగతికంఠం' అంటారు. స్తంభూషణ లక్షణానుసారంగా ఒకొక్కక్క స్తంభపు ఉప పీఠాన్ని నిర్మించారు. ఆస్తంభాలు రాతి యొక్క వెలుపలి కొలతలు 11-8" చతురంలో ఉన్నాయి. ఇవి 6 భాగాలుగా ఉన్నాయి. ఒక్కొక్క భాగంలో క్షేత్ర మహాత్మ్యమును దర్శింపజేసారు.ముందు వరుసలో గరుత్మంతుడు, జయ విజయులను, ఒకవైపు ఆంజనేయ స్వామి, జయవిజ యులను మరొక వైపు నిలిచారు. రామదాసు, శివధనుర్భంగం, చతుర్భజ రాముడు, పాణిగ్రహణం, పోకల దమ్మక్క శేషశాయి, శ్రీరామ పట్టాభిషేకం, గీతోపదేశం జనక మహారాజు కన్యాదానం, పంచముఖ వాద్యం, భద్రునికి రామ సాత్కారం, ముందు వరుసలో ఉన్నాయి. శివ ధనుర్భంగం వృత్తాంతంలో రెండు పాణి గ్రహణంలో 16, పట్టాభిషేకంలో 12, కన్యాదానంలో 13 విగ్రహాలు మలచారు. శిల్ప శాస్త్ర ప్రకారం ఈ భాగాన్ని 'కంఠం' అని అంటారు. ఈ మండపంలో మరో అద్భుత నిర్మాణం కపోత పట్టిక. ఇందులో ఉత్తరాన ఎటుతుకం అనుభాగాలున్నాయి.
దీనిలో మతలై అను పేరు గల కొన్ని వందల శిల్పాలు 21/2 అంగుళాల ఎత్తుగలవి ఉన్నాయి. పైభాగం చూరువలె ఉంటుంది. దీనినే 'కపోతకం' అంటారు. దీనిలో 13 పద్మ దళాలు, అష్టదిక్పాలకులు అష్టలక్ష్ములు, గరుత్మంతుడు, మహాసాలభంజికలు నిర్మించారు. పత్రోప పీఠంపై మెట్లు, మెట్లకు రెండు ప్రక్కల ఏనుగులు, కోలాటం ఆడే స్త్రీలు, హంసలు ఉన్నాయి. వృషభ కుంజరం అంటే ఒకవైపు వృషభంగా మరోవైపు ఏనుగులా

# నేడు భద్రాద్రి సీతారాముల కళ్యాణం..

కనిపించే అద్భుత శిల్పం. ఈ పుత్రోప పీఠంపై పద్మాసనం నల్లరాతితో నిర్మించబడిన నిగనిగ లాడుతుంటుంది. దీనిపైనే సీతారాముల కళ్యాణం జరుగుతుంది. 9 టన్నుల బరువు గల ఏకశిలతో ఇది నిర్మించబడింది. దీని అష్ట దళాలపై అష్ట మంగళం కనిపిస్తుంది. శంఖం, చక్రం, మత్స్య యుగ్మము, దర్పణం, స్వస్తికం, దీపం, పూర్ణ కుంభం, శ్రీవత్సం వీటిని అష్ట మంగళం అంటారు. ఈ మండపానికి 'షోడశ స్తంభ మండపం' అంటారు. ఇది 16 స్తంభాలతో విలసిల్లుతున్నది.
ఈశాన్య స్తంభంలో అనేక శిల్ప శాస్త్ర, సాంకేతిక విషయాలున్నాయి. దీనిపై పద్మ పుష్కలం, అధిష్టానం, పద్మ దళాలు నిర్మించారు. ముందు భాగంలో చెక్కబడిన మూడు ముఖపత్రాలపై మూడు సింహాలు ఉన్నాయి. ఆ సింహాల నోళ్ళలో అదే రాతితో చెక్కిన రాతి గుండు ఉన్నాయి. ఇది చాలా అద్భుత ఆశ్చర్యకర శిల్పం. మఖ స్తంభంలో కమలా రామదాసుల శిల్పాలు, మంటప ద్వారమందు పడమరగా రుక్మిణీ సత్యభామా సమేతుడైన శ్రీకృష్ణుడు, ఆగ్నేయ స్తంభంపై శ్రీ భూదేవి సమేతుడైన పరవాసుదేవుడు, చెలిక త్తెలతో శ్రీమహాలక్ష్మీ,ఆళ్వారులు, విరాజిల్లు తున్నారు. షోడశ భుజాలతో అలరారే సుదర్శన మూర్తి కూడా ఉన్నారు. నైరుతి స్తంభంలో ఉత్తర భాగంలో వ్యత్యస్త పాదార విందుడైన వేణుగోపాలుడు, పై భాగంలో వట పత్రశాయి కనులవిందుగా దర్శనమిస్తారు.
తూర్పు వైపు సరస్వతీ దేవి వీణాపాణియై కనిపిస్తుంది. దక్షిణంగా కాళీయమర్దన, రాధాకృష్ణులు, హంస, బ్రహ్మ విలసిల్లు తున్నాయి. స్తంభాలకు పై భాగంలో నాలుగు మూలల్లో రాతి గొలుసులు వ్రేలాడుతున్నాయి. ఒక్కొక్క గొలుసుకు 4 అంగుళాల పొడవు గల 50 రింగులున్నాయి. పై కప్పు లోపలి భాగంలో 12 కోష్టములు రాశి చక్రం కనిపిస్తాయి. ఇంకా అనేక శిల్ప విశేషాలతో విరాజిల్లుతున్న ఈ కళ్యాణ మండపం భారతదేశ శిల్పకళా ఖండాలలో ఒకటిగా పేర్కొనవచ్చు. ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఎక్కడా లేనివిధంగా కళ్యాణంలో మూడు సూత్రాలు కలిగిన మంగళ సూత్రాన్ని సీతమ్మ మెడలో ధరింపచేస్తారు.

**ఒకే రోజు రెండు సార్లు కళ్యాణం..**
శ్రీరామనవమి రోజు భద్రాద్రిలో రెండుసార్లు కళ్యాణం నిర్వహిస్తారు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. ఇది వాస్తవం. నవమి నాడు తెల్లవారుజామున రెండు గంటలకే ఆలయం తెరుస్తారు. సుప్రభాతం, అభిషేకం, ఆరాధన నిర్వహించాక గర్భాలయంలోని ధ్రువమూర్తులకు కళ్యాణం నిర్వహిస్తారు. ఈ తతంగం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు సాగుతుంది. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల వేదోచ్చారణ నడుమ స్వామి వారి ఉత్సవ మూర్తులు పల్లకిపై ఊరేగింపుగా మిథిలా స్టేడియంకు చేరుకుంటారు. అశేష భక్త జనం జయజయ ధ్వానాల నడుమ అభిజిత్ లగ్నంలో సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహిస్తారు.

**అభిజిన్ముహూర్తం అంటే...**
చైత్రశుద్ధ నవమి నాడు కర్కాటక లగ్నం, పునర్వసు నాడు శ్రీరామచంద్రుడు సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు జన్మించినట్లు పురాణాలు చెప్తున్నాయి. స్వామి వారు జన్మించిన సమయాన్నే శుభముహూర్తం గా భావించి భద్రాద్రిలో జరిగే కళ్యాణ తంతులో గుడ జీరక దారణం మధ్యాహ్నం 12 గంటలకు పెడతారు. సీతారాముల కళ్యాణంలో ఈ ముహూర్తాన్ని అభిజి న్ముహూర్తం గా పేర్కొంటారు.

**కళ్యాణంలో మూడు తాళిబొట్లు..**
ప్రపంచవ్యాప్తంగా ఏ దేవుని కళ్యాణంలో గాని, మానవుల కళ్యాణాలలో రెండు తాళి బొట్లు కలిగిన మంగళసూత్రం దర్శనం ఇస్తుంది. కానీ భద్రాచలం పుణ్యక్షేత్రంలో శ్రీరామ నవమి నాడు నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణంలో మాత్రం మూడు తాళిబొట్టు గల మంగళ సూత్రం మనం చూస్తాం. ఎందుకు మూడు తాళిబొట్టు గల సూత్రం కళ్యాణంలో అమ్మవారికి ధరింప చేస్తారంటే.. ఒకటి మామగారైన దశరథ మహారాజు తరపున, మరొకటి పుట్టింటి నుండి జనకమహారాజు తరపున, మూడవది సీతమ్మ తల్లిని తన కూతురుగా భావించి భక్త రామదాసు చేయించినది. అందుకే భద్రాద్రిలో నవమి నాడు కళ్యాణంలో మూడు తాళిబొట్టు కలిగిన మంగళ సూత్రం అమ్మవారికి ధరింపజేస్తారు.

**తలంబ్రాలు ఎరుపు రంగులో ఎందుకు ఉంటాయంటే..**
ఎక్కడైనా తలంబ్రాలు అంటే మనకు గుర్తుకు వచ్చేది పసుపు రంగు. కానీ భద్రాద్రిలో శ్రీరామనవమి నాడు కళ్యాణంలో ఉపయోగించే తలంబ్రాలు ఎరుపు రంగులో ఉంటాయి. దీనికి ఒక చారిత్రక కారణం ఉంది. తానీషా ప్రభువు భక్త రామదాసును బంధించిన తర్వాత, తానీషాకు రామ, లక్ష్మణులు కలలో సాక్షాత్కరించి, రామదాసు చెల్లించవలసిన పైకము చెల్లిస్తారు. రామదాసును బంధించి తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపం చెందిన తానీషా, ప్రతి సంవత్సరం భద్రాద్రిలో జరిగే సీతా రాముల వారి కళ్యాణానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో పాటు బుక్కా గులాల్‌ను కానుకగా పంపేవారు. ఆ విధంగా తానీషా స్వామివారికి పంపే గులాల్ కళ్యాణ తలంబ్రాలలో కలపడం కారణంగా అవి ఎర్రగా మారేవి. ఇప్పటికీ అదే సంప్రదాయం కొనసాగిస్తూ.. కళ్యాణ తలంబ్రాలలో గులాల్, సుగంధ ద్రవ్యాలు కలుపుతున్నారు. అందుకే భద్రాద్రిలో కళ్యాణ తలంబ్రాలు ఎర్రగా ఉంటాయి.

# అమ్మో.. మళ్లీ కరోనా..!

గతంలో ఎదుర్కొన్న లాక్‌డౌన్‌లు, ప్రాణనష్టం, ఆర్థిక కష్టాలు మళ్లీ తలచుకుంటూ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఉన్న కుటుంబాల్లో ఈ భయం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. ఆసుపత్రుల్లో బెడ్ల కొరత ఏర్పడవచ్చనే ఆందోళనతో చాలా మంది ముందస్తు జాగ్రత్తగా పరీక్షలు చేయించుకుంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించడం, పరిశుభ్రతపై దృష్టి పెట్టడం మళ్లీ పెరిగింది.
ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ కొత్త రకం పాత రకాల కంటే భిన్నమైన మార్పులను కలిగి ఉండే అవకాశం ఉంది. అందువల్ల ఇప్పటికే టీకాలు తీసుకున్నవారిలో కూడా సంక్రమణ సంభవించే ప్రమాదం ఉందనే ప్రచారం కొనసాగుతోంది. వైరస్ స్వభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి పరిశోధనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం కూడా ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అవసరానికి మించి భయపడవద్దని విజ్ఞప్తి చేస్తోంది. అయితే సోషల్ మీడియా ద్వారా వ్యాపిస్తున్న వివిధ రకాల సమాచారం ప్రజల్లో గందరగోళాన్ని పెంచుతోంది.
ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తతే ప్రధాన ఆయుధమని వైద్య నిపుణులు చెబుతున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, గుంపుల నుంచి దూరంగా ఉండటం, అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు. అమెరికా ప్రభుత్వం తీసుకునే చర్యలు, ప్రజల సహకారం ఆధారంగా ఈ పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఒకే ఒక్క క్లిక్.. అరచేతిలో 'భూమి' సమాచారం!

ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదే విధంగా పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మై ల్యాండ్ పోర్ట్ ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వే నంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్ వంటి పూర్తి సమాచారం ఉంటుందన్నారు. అన్ని రకాల సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూ భారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్ఎంఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు


2024లో 18 ఎంవోయూలతో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు రాగా, 2025లో 26 ఎంవోయూలతో రూ.1,78,950 కోట్లు కలుపుకుని మొత్తం 44 ఎంవోయూలతో రూ.2,19,182 కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. అయితే, దావోస్ పర్యటనల్లో భాగంగా రూ.81,800 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఎంవోయూలు కుదుర్చుకున్న 6 కంపెనీలకు ఇప్పటికే భూములు కేటాయించామని చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. ఇక నిజామాబాద్ ఐటీ టవర్ మొత్తం 681 సీట్ల సామర్థ్యం ఉందని, ప్రస్తుతం అక్కడ 11 కంపెనీలు 276 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని మంత్రి శ్రీధర్ బాబు సభలో ప్రస్తావించారు.

# పీఆర్‌సీ గడువు మళ్లీ పొడిగింపు

**రెండు రోజుల క్రితం అసెంబ్లీలో..**
ప్రస్తుతం బడ్జెట్ సమావేశాల సందర్భంగా విపక్షాలు సైతం ఈ విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోగా కొత్త పీఆర్సీ ఇస్తామని ఎలక్షన్ మేనిఫెస్టోలో చెప్పారని కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు కావొస్తున్నా పీఆర్సీ ఇవ్వలేదు. మళ్లీ ఎక్స్‌టెన్షన్ ఇస్తారా? కనీసం ఇప్పుడైనా రిపోర్ట్ తీసుకుని ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ఎప్పటిలోగా ఇస్తారో స్పష్టంగా చెప్పాలని రెండు రోజుల క్రితం శాసనసభలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే ప్రభుత్వం మాత్రం మరోసారి పీఆర్సీ కమిటీ పొడిగింపుకే మొగ్గు చూపింది.

# ఆరోగ్యశ్రీ బకాయిలు గత ప్రభుత్వ పుణ్యమే..


**అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఫైర్**



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**
ఆరోగ్యశ్రీ బకాయిల విషయంలో విపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన అసెంబ్లీలో ఆరోగ్యశ్రీపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ బిల్లులను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తున్నామని ప్రభుత్వం చెప్పిందని, కానీ చెప్పిన విధంగా విడుదల కావడం లేదని ప్రశ్నించిన హరీశ్‌రావుకు ఆయన సమాధానం ఇచ్చారు.

**త్వరలో అన్ని విషయాలు బయటకు వస్తాయి..**
గత ప్రభుత్వం సుమారు రూ.600 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెట్టిందని విమర్శించారు. అందులో ప్రభుత్వ ఎయిడెడ్ ఆస్పత్రులకు రూ.240 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ.360 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా సగటున రూ.89 కోట్లు ఖర్చు చేస్తూ, మొత్తంగా రూ.2,408 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలను క్లియర్ చేశామని అన్నారు. అందులో ప్రభుత్వ ఎయిడెడ్ ఆస్పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లింపులు జరిగాయని వెల్లడించారు.
అయితే, ఆరోగ్యశ్రీ విషయంలో నిరుపేదలకు అన్యాయం జరుగుతోందంటూ అపోహలు కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసని చురకలంటించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ సొమ్మును కాజేశారో కూడా తెలుసని, దీనిపై విచారణ జరుగుతోందని, త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# మిల్స్ కాలనీ ఎస్సైపై సస్పెన్షన్ వేటు!




**స్టార్ త్రినేత్రం, వరంగల్:**
ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు, శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు ఆ పనిని సక్సెస్ ఫుల్ గా నిర్వహిస్తే ప్రజా జీవితం ప్రశాంతంగా ముందుకు సాగుతుంది. అలాకాకుండా రక్షించాల్సిన పోలీసులే, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే, శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తే, అటువంటి పోలీసులు సమాజానికి హానికరంగా మారతారని చెప్పవచ్చు.

**మిల్స్ కాలనీ ఎస్సై సస్పెన్షన్..**
ఈ క్రమంలోనే అలా సమాజానికి చెడు చేసే పోలీసులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, తప్పు చేసిన పోలీస్ ఆఫీసర్ ఎంతటి వాడైనా సరే కచ్చితంగా అందుకు తగిన శిక్ష అనుభవిస్తాడని పోలీస్ వ్యవస్థ ఎప్పటికప్పుడు చెబుతూనే ఉంది. ఈ క్రమంలోనే తాజాగా వరంగల్ నగరంలోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తున్న ఎం.సురేష్‌పైన సస్పెన్షన్ వేటు పడింది.

**అధికారుల విచారణలో ఆరోపణలు రుజువు..**
వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఎస్సై అవినీతికి పాల్పడుతున్నాడని, వచ్చిన ఆరోపణలు అధికారుల విచారణలో రుజువు కావడంతో సస్పెండ్ చేశారు. గత కొంతకాలంగా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

# సంగెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్






స్టార్ త్రినేత్రం, వరంగల్: వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం సంగెం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు స్థానిక పోలీస్ అధికారులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, ఆవరణలో మామిడి మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణపై తన సందేశాన్ని ఇచ్చారు. స్టేషన్ శుభ్రత, నిర్వహణ, సౌకర్యాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఆయన, పోలీస్ వ్యవస్థలో పారదర్శకత, క్రమశిక్షణ ఎంత ముఖ్యమో సిబ్బందికి వివరించారు. తదుపరి స్టేషన్ పనితీరును సమగ్రంగా పరిశీలించిన కమిషనర్.. స్టేషన్ పరిధిలోని గ్రామాల పరిస్థితులు, ప్రజల జీవన విధానం, ప్రాంతంలో నమోదవుతున్న నేరాల స్వభావం, రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలపై ఎస్సైని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే బీట్ వ్యవస్థ అమలు, రాత్రి పహారా విధులు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ వ్యవస్థ సమర్థంగా పనిచేయాలంటే ప్రతి విభాగం సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, నిందితుల అరెస్టుకు సంబంధించిన పురోగతిని కూడా కమిషనర్ పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగేలా పోలీసులు పని చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడం, విధి నిర్వహణలో అలసత్వం లేకుండా పారదర్శకంగా సేవలు అందించడం అత్యవసరమని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని పొందడం పోలీస్ వ్యవస్థకు అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సిఐ రాజగోపాల్, సంగెం ఎస్సై వంశీ కృష్ణతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అబ్దుల్లాపూర్మెట్ లో ఘనంగా దివంగత మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి వేడుకలు

**ధర్మబిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్ గౌడ్**




స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్మెట్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రవీణ్ గౌడ్ అన్నారు. బుధవారం అబ్దుల్లాపూర్మెట్ మండల కేంద్రంలో దివంగత మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతిని మండల గౌడ సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామోజీ ఫిలిం సిటీ సమీపంలో ఉన్న ధర్మభిక్షం విగ్రహానికి ప్రవీణ్ గౌడ్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ..ధర్మభిక్షం కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, ఆయన అణగారిన వర్గాల గొంతుక. నాడు నిజాం వ్యతిరేక పోరాటంలో అలుపెరగని పోరాటం చేసి, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మహనీయుడు అని ప్రవీణ్ గౌడ్ కొనియాడారు. "గీత కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. నీతి, నిజాయితీతో కూడిన ఆయన రాజకీయ ప్రస్థానం నేటి యువతకు మరియు రాజకీయ నాయకులకు ఒక దిక్సూచి వంటిది. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన పిలుపునిచ్చారు.

# హయత్ నగర్ దయ ఓల్డ్ ఏజ్ హోమ్ లో ఘనంగా మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి వేడుకలు

**ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రముఖులు**






స్టార్ త్రినేత్రం, హయత్ నగర్: హయత్ నగర్ డివిజన్ బంజారా కాలనీలోని దయ ఓల్డ్ ఏజ్ హోమ్ లో గురువారం దివంగత మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షం 15వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దయ ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకురాలు బి.మానస గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, నల్గొండ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు సుంకరి మల్లేష్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, దయ ఓల్డ్ ఏజ్ హోమ్ మరియు విధేయత హాస్పిటల్ చైర్మన్ యం. ఉపేందర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై దివంగత బొమ్మగాని ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఆశ్రమంలోని వృద్ధులు, అనాధలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..""ధర్మభిక్షం విద్యార్థి దశ నుంచే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పారు. పాఠశాలలో నిజాం నవాబు పుట్టినరోజు వేడుకలను బహిష్కరించి, విద్యార్థులను చైతన్య పరిచిన ధీశాలి ఆయన. నిజాం రజాకార్ల అరాచకాలను ఎదురిస్తూ తుపాకీ పట్టి సాయుధ పోరాటంలో అగ్రభాగాన నిలిచిన వీరయోధుడు ధర్మభిక్షం" అని వారు గుర్తు చేశారు. ఐదేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించినా, ప్రాణాలకు తెగించి ప్రజల కోసం పోరాడారే తప్ప ఏనాడూ వెనకడుగు వేయలేదని కొనియాడారు. ముఖ్యంగా వెనుకబడిన తరగతుల, గీత కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని వారు ప్రత్యేకంగా ప్రస్తావించారు. " 'దున్నేవాడికే భూమి.. గీసేవాడికే చెట్టు' అనే నినాదంతో ఆయన అసంఘటిత కార్మికులను ఏకం చేశారని, ఆల్ ఇండియా గీత పనివారల సమాఖ్య అధ్యక్షుడిగా దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం పోరాడారన్నారు. నిరాడంబరతకు నిలువుటద్దంగా నిలిచిన ధర్మభిక్షం మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా గెలిచినా సామాన్య ప్రజల మధ్యే గడిపారు" అని వారు పేర్కొన్నారు.ధర్మభిక్షం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు. నేటి తరం రాజకీయ నాయకులు ఆయన క్రమశిక్షణను, ప్రజా సేవ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గౌడ సంఘాల ప్రతినిధులు, మరియు పెద్ద ఎత్తున ధర్మ బిక్షం అభిమానులు పాల్గొన్నారు.

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 278 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | శుక్రవారం, 27-3-2026 | పేజీలు: 4 | వెల: 2
WARANGAL VOL-1 ISSUE-278 Editor: D.SHIVAKRIHSNA FRIDAY, 27-3-2026 Pages: 4 Price: 2

# అభివృద్ధి ఎవరిది?.. క్రెడిట్ ఎవరిది?

**స్టార్ త్రినేత్రం, అమరావతి :**

తమ హయాంలో కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేదని విమర్శలు ఎదుర్కొంటున్న వైసీపీ.. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల్లో వాటా కోసం ప్రయత్నిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. తాజాగా అర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ప్రభుత్వం భూమి పూజచేసింది. అనంతపురం ఆర్డీటీ సేవలను అతరాయం లేకుండా కొనసాగించేందుకు కేంద్రం నుంచి అనుమతులు సాధించింది. అంతకు ముందు వైజాగ్‌లో ఇనార్బిట్ మాల్ ప్రారంభోత్సవం జరిగింది. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతి స్పష్టంగా కనిపిస్తుండటంతో వైసీపీ నేతలు క్రెడిట్ వార్ మొదలుపెడుతున్నారు. ప్రభుత్వ విజయాలన్ని తమ ఖాతాలో వేసుకోవడానికి వారు అంతలా తాపత్రయపడుతుండటం చూస్తూ అందరూ ఆశ్చర్యపోతున్నారు.

**విశాఖలో కొత్త రైల్వే జోన్..**


కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజామన్ననలు పొందడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. వైసీపీ హయాంలో పూర్తిగా మూలనపడ్డ రాజధాని అమరావతి పనులు కేంద్ర సహకారంతో పరుగులు పెడుతున్నాయి. ప్రజల మౌళిక వసతులు, రోడ్ల అభివృద్ధి పనులు, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు వంటి అభివృద్ధి శరవేగంతో సాగుతోంది. ఇక తాజాగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్‌కు భూమి పూజ, వైజాగ్‌లో ప్రారంభమైన ఇనార్బిట్ మాల్, అనంతపురం ఆర్డీటీ సేవలు పునరుద్ధించడం వంటి రాష్ట్ర ప్రగతికి సంబంధించిన అంశాలు చకచకా జరిగిపోతున్నాయి.

**జగన్ హయాంలో బటన్ పాలిటిక్స్..**

జగన్ హయాంలో బటన్ పాలిటిక్స్.. అంటే నవరత్నాల పేరుతో పేదల ఖాతాల్లోకి నగదు చేయడమే అభివృద్ధని భావించారని, అదే తమను తిరిగి అధికారంలోకి తెస్తుందన్న నమ్మకంతో ఉన్నారన్న అభిప్రాయం ఉండేదంటారు. ఎన్నికల ప్రచారంలో కూడా జగన్.. అక్కా చెల్లెమ్మలు, అవ్వాతాతలు తన వెంటే ఉన్నారని ధీమా పోయారు. తీరా ఎన్నికల ఫలితాల తర్వాత మీడియా ముందుకొచ్చిన ఆయన.. ఆ ఓట్లన్నీ ఏమైపోయాయని బేల ముఖంతో ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.

**వైసీపీ ఊకదంపుడు ఉపన్యాసాలు..**

ఎన్నికల ప్రచారంలో తాము చేసిన బటన్ పాలిటిక్స్ గురించి తప్ప .. అభివృద్ధి పరంగా వైసీపీ ఎలాంటి ప్రచారం చేసుకో లేకపోయిందన్న ఆరోపణలున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర అభివృద్ధి పనులు శరవేగంతో పురుగులు పెడుతున్నాయి. ఇటీవల విశాఖలో ఇన్ఆర్బిట్ పాల్ ప్రారంభోత్సవం జరిగింది. దానికి అనుమతులిచ్చింది జగనే అని వైసీపీ నేతలు ఊదరగొడుతున్నారు. వాస్తవానికి అలాంటి కమర్షియల్ కాంప్లెక్స్‌కు సంబంధించి ప్రభుత్వ ప్రమేమీ ఏమీ ఉండదు. అయినా అప్పట్లో అది పూర్తి కాలేదు. కాని తాము మొదలు పెట్టిన ఇన్ఆర్బిట్ మాల్ క్రెడిట్ చంద్రబాబు తన ఖాతాలో వేసుకుంటున్నారని వైసీపీ నేతలు ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్నారు.



**విశాఖ ఉక్కును మించిన ప్లాంట్..**

తాజాగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. సీఎం చంద్రబాబు సహా, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యులు లోకేశ్ వంటి వారు, కేంద్ర మంత్రులు అందులో పాల్గొని చంద్రబాబు పాలనా దక్షతని కొనియాడారు. అయితే అర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ నక్కపల్లి రావడానికి ప్రధాన కారణం జగన్ అని వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్తున్నారు. దావోస్లో ఆ స్టీల్ ప్లాంట్ కోసం ఆదిత్య మిట్టల్ తో అప్పటి సీఎం జగన్ సంప్రదింపులు జరిపారంట. గ్రీన్ కో ప్రాజెక్ట్ తో పాటు స్టీల్ ప్లాంట్ ను రాష్ట్రంలో పెట్టాలని జగన్ కోరారని గుడివాడ బల్లగుద్ది మరీ చెప్తున్నారు.

**బల్క్ డ్రగ్ పార్క్ జగన్ తెచ్చారా?..**

ఇన్నార్ బిట్ మాల్, బల్క్ డ్రగ్ పార్క్‌ను అప్పటి సీఎం జగనే తీసుకొచ్చారని అమర్‌నాథ్ ఘంటా పథంగా చెప్తున్నారు. జగన్ తెచ్చిన బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణాన్ని ఇప్పటికీ కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందంట. దాంతో 35 వేల మందికి ఉపాధి కల్పించే బల్క్ డ్రగ్ పార్క్ అయోమయంలో పడిందని అమర్ విమర్శిస్తున్నారు. అదే ఫోలోలో షర్మిల తన అవసరాల కోసం జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారని అమర్‌నాథ్ మండిపడుతున్నారు. ఇక జగన్ తమ నోటిని కట్టడి చేస్తున్నారని, మీరు హద్దు మీరితే జగన్ చెప్పినా వినే పరిస్థితి ఉండదని కూటమి పెద్దలకు వార్నింగులు ఇస్తున్నారు.

**వైసీపీ క్రెడిట్ డ్రామాలకు చెక్!..**

మొత్తానికి అర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ నక్కపల్లి రావడానికి ప్రధాన కారణం వైఎస్ జగన్ అంటుంది వైసీపీ. అయితే మంత్రి నారా లోకేష్ చోరవతో ఇది సాకారం అయిందని అంటున్నారు కూటమి నేతలు. ఇక ఆర్డీటీ సేవల పునరుద్దరణ విషయంలోను ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అనంతపురం ప్రజల గుండెచప్పుడు ఆర్డీటీకి అనంతపురం జిల్లా వైసీపీ నేతలు అవిశ్రాంత పోరాటంతో లైన్ క్లియర్ అయ్యిందని వైసీపీ నేతలు అంటున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కనీసం ప్రస్తావించని వైసీపీ నేతలు.. ఇప్పుడు క్రెడిట్ కోసం పాకులాడుతుండటం హాట్ టాపిక్‌గా మారింది. వారి వాదనే నిజమైతే అవన్నీ ముందే ఎందుకు చెప్పుకోలేకపోయారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**భూములపై కన్నేసిన వైసీపీ నేతలు: మంత్రి సవిత**

రాయలసీమ గడ్డపై సేవ అనే పదానికి మారుపేరు ఆర్డీటీ సంస్థ. గత 50 ఏళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఈ సంస్థ ఒక ఆపద్బాంధవిలా నిలుస్తోందని బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అంటున్నారు. స్పెయిన్ నుంచి వచ్చిన విన్సెంట్ ఫెర్రర్, ఆన్ ఫెర్రర్ దంపతులు ఇక్కడి వెనుకబడిన ప్రాంతాలను చూసి చలించి, మన ప్రజల కోసం విద్య, వైద్యం, క్రీడలు, వ్యవసాయం, గృహనిర్మాణ రంగాల్లో వారు అనేక సేవలు చేశారని అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఆర్డీటీ వంటి సేవా సంస్థను కూడా రాజకీయ కక్షతో వేధించిందని విమర్శలు గుప్పించారు. విదేశీ నిధుల రెన్యూవల్ విషయంలో కావాలని ఇబ్బందులు పెట్టి, సంస్థ సేవలు ఆగిపోయేలా కుట్రలు చేసింది. ఆ సంస్థకు ఉన్న భూములను కబ్జా చేయాలని చూశారని ఆరోపించారు.

# కవిత 2.0 షురూ!

## ఇక ఇందూరు గడ్డపై యుద్ధమే..

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకోబోతోంది. కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో కవిత చాలా వేగంగా అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే. కవిత తనకు రాజకీయంగా పేరు తెచ్చిన జిల్లా అయినా నిజామాబాద్ వేదికగా కొత్త పార్టీ స్థాపనకు మొదటి అడుగు పడనుందట. వచ్చే శ్రీరామ నవమిన రోజు నిజామాబాద్ జిల్లా నుంచి పార్టీ పేరు అనౌన్స్ చేయబోయే తేదీని ప్రకటించనున్నారంట. ఆమె ఏర్పాటు చేయనున్న పార్టీకి సంబంధించి తాజాగా ఇది కీలక అప్‌డేట్ అని చెప్పుకోవచ్చు. కల్వకుంట్ల కవిత స్థాపించనున్న కొత్త రాజకీయ పార్టీ పేరు ఖరారైంది. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో పొలిటికల్ పార్టీని ఆమె ఏర్పాటు చేయనున్నారు. పార్టీ అనౌన్స్ మెంట్ డేట్ దగ్గర పడుతుండటంతో తెలంగాణ జాగృతి భారీ ఏర్పాట్లు చేస్తునట్లు తెలుస్తోంది.



**నిజామాబాద్‌లో కవిత కీలక నిర్ణయం**

తెలంగాణ జాగృతి స్థాపించిన తర్వాత తెలంగాణ ఉద్యమానికి సంబంధించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అలవర్చుకొని ఒక బలమైన నేతగా నిజామాబాద్ జిల్లాలో నిలదొక్కుకున్నారు కల్వకుంట్ల కవిత. ఎంపీగా, ఎమ్మెల్సీగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచే ఎన్నికయ్యారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ.. అని దాశరథి జైలు గోడలపై రాసిన స్థలం శ్రీ రఘునాథ ఆలయం. జిల్లాలోని ఆ రామమందిర్ లో ఈ నెల 27 న సీతారాముల కళ్యాణంలో కవిత ఆమె భర్త అనిల్ ఇద్దరు పాల్గొంటున్నారు. సీతారాముల కళ్యాణం అనంతరం పండితుల ఆశీర్వాదంతో అక్కడే కవిత పెట్టబోయే కొత్త పార్టీ ప్రకటన చేయనున్నారట.

**ఇందూరు గడ్డపై కవితమ్మ రాజకీయం 2.0**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కవిత అనుచర వర్గం, జాగృతి నాయకులు కార్యకర్తలు ఆమె స్థాపించబోయే పార్టీ కోసం పెద్ద ఎత్తున ఎదురు చూస్తున్నారు. తండ్రి స్థాపించిన బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి, ఎమ్మెల్సీ పదవికి సైతం రాజీనామా చేసిన కవిత గత డిసెంబరులోనే కొత్త పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 23న ఈ పార్టీ పేరిట రిజిస్ట్రేషన్ కోసం కవిత కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేశారు. ఆదిశగా పార్టీ కి సంబంధించిన పనులు ముందుకు సాగుతున్నాయి. తెలంగాణ ప్రజా జాగృతి పేరుతో పార్టీని, పార్టీ గుర్తుగా ధర్మగంటను నిర్ణయించి కవిత ఈసీ రిజిస్ట్రేషన్ కోసం ధరఖాస్తు చేసుకున్నారు.

**శ్రీరామ నవమి సాక్షిగా ముహూర్తం ఫిక్స్**

ఆ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొలిక్కి వస్తుండటంతో శ్రీరామ నవమి రోజు పార్టీ ఎప్పుడు ప్రకటించేది డేట్ అనౌన్స్ చేయనున్నారు. ఎక్కడి నుంచి పార్టీ అనౌన్స్ మెంట్ డేట్ కోసం ఎదురు చూస్తున్న తెలంగాణ జాగృతి నేతలు దానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆమె సొంత జిల్లా అయిన నిజామాబాద్‌లో బీఆర్ఎస్ నుంచి పెద్దఎత్తున నేతలు, కార్యకర్తలు కొత్త పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పలువురు మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు .. ఆమె వల్ల రాజకీయంగా లబ్ధి పొందిన వారు పార్టీ అనౌన్స్ మెంట్ ఎప్పుడా అని వెయిట్ చేస్తున్నారంట.

**ఆ 'నాలుగు దయ్యాల' గుండెల్లో వణుకు**

కవిత నిజామాబాద్ జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెట్టడానికి చాలా కారణాలు ఉన్నాయంటున్నారు నిజామాబాద్ ఎంపీగా కవిత రెండో సారి పోటీ చేసినప్పుడు ఓటమి పాలయ్యారు. ఆ పరాజయానికి సొంత పార్టీ వారే కారణమని ఆమె పలుమార్లు ప్రస్తావించారు. తనను పార్టీ నుంచి దూరం చేసేందుకు ఆ నాలుగు దయ్యాలకు జిల్లా నేతల సహకరించారని చాలా సార్లు కవిత ఆరోపించారు. ఆ క్రమంలో పార్టీ అనౌన్స్ మెంట్ తరువాత ఫస్ట్ జిల్లాలో కవితకు వ్యతిరేకంగా పనిచేసిన వారే టార్గెట్ అవుతారన్న టాక్ వినిపిస్తోంది. మొత్తానికి కవిత మాత్రం సీతారాముల కళ్యాణం రోజు పార్టీ అనౌన్స్ చేసే డేటు ప్రకటించనుండటంతో ఆమె పార్టీలో చేరడానికి ఉత్సహాంగా ఉన్న జిల్లా నేతల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోందంటున్నారు.

# ఇవాళ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోడీ కీలక భేటీ!

**స్టార్ త్రినేత్రం, జాతీయం:**



పశ్చిమ ఆసియాలో ఇజ్రాయెల్/అమెరికా – ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ యుద్ధ మేఘాల ప్రభావం ప్రపంచ దేశాలతో పాటు భారత్‌పై కూడా పడే అవకాశం ఉండటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ (LPG) సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగారు. పశ్చిమ ఆసియా పరిణామాలపై చర్చించేందుకు ప్రధాని మోడీ ఇవాళ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ భేటీలో పలు అంశాలపై చర్చించనున్నారు.

**రాష్ట్రాలకు ఆదేశాలు..**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల పెరుగుదల మరియు దేశీయంగా పెట్రోల్, డీజిల్ నిల్వలపై సమీక్షించనున్నారు. ఇంధన కొరత ఉందంటూ వస్తున్న పుకార్లను అడ్డుకోవడం, ప్రజల్లో భయాందోళనలు కలగకుండా చూడాలని ఆదేశాలివ్వనున్నారు. రాష్ట్రాల వారీగా గ్యాస్ మరియు పెట్రోల్ సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించనున్నారు. యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల నుండి చమురు రవాణాకు ఆటంకం ఏర్పడటంతో భారత్‌లో గ్యాస్, పెట్రోల్ కష్టాలు మొదలయ్యే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై కేంద్ర పెట్రోలియం శాఖ ఇప్పటికే స్పందించింది. భారత్‌లో ప్రస్తుతం 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. యుద్ధం వల్ల సముద్ర మార్గాల్లో రవాణా ఇబ్బందులు ఎదురైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు దిగుమతి చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. చమురు నిల్వలను బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూలు లేకుండా పర్యవేక్షించాలని ఇప్పటికే కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. ఇవాల్టి సమావేశం తర్వాత ఇంధన వినియోగం మరియు ధరల నియంత్రణపై కేంద్రం మరిన్ని కీలక మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉంది.

# ఆ పోస్టుల పేర్ల మార్పు..

## జీఎస్టీ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**

జీఎస్టీ సవరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ అమోదం తెలిపింది. గురువారం సభలో చర్చ జరిగిన అనంతరం జీఎస్టీ సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది. సేల్స్ టాక్స్ కమిషనర్ పోస్టును చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్‌గా మార్పు చేశారు. అలాగే అదనపు కమిషనర్ (గ్రేడ్–1) పోస్టును స్టేట్ టాక్స్ కమిషనర్‌గా మార్చుతూ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చింది. ఒకే దేశం, ఒకే చట్టం నినాదంతో జీఎస్టీ చట్టాన్ని చేసినప్పటికీ కేంద్రం,



రాష్ట్రంలోని శాఖాధిపతుల మధ్య హోదాలో తేడాలు ఉండటం వల్ల వీటన్నింటిని యూనిఫామ్ చేసేందుకు ఈ చట్ట సవరణ చేస్తున్నామని సభలో ప్రభుత్వం వెల్లడించింది.


**రాష్ట్రానికి నష్టమేమి లేదు..**

జీఎస్టీ చట్టం లక్ష్యాం నెరవేర్చేందుకు అవసరమైన కమ్యూనికేషన్, కో ఆర్డినేషన్ కోసం సులభతరం కావాలని అందుకనే మిగతా రాష్ట్రాల్లో మాదిరిగా సేల్స్ టాక్స్ కమిషనర్ పోస్టును చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్‌గా, అదనపు కమిషనర్ (గ్రేడ్–1) పోస్టు.. స్టేట్ టాక్స్ కమిషనర్‌గా మార్చుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ బిల్లు ద్వారా ఆర్థిక పరమైన అంశాలేమి లేవని, ఉద్యోగాలు తగ్గవనని ఈ బిల్లుపై చర్చ సందర్భంగా సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ సవరణ ద్వారా రాష్ట్రానికి వచ్చే నష్టమేమి లేదని తెలిపారు. అనంతరం సభ ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది.

# ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు

- **9.45 లక్షల మందికి ఉచిత వైద్యం**
- **అసెంబ్లీలో మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి!**

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 9 లక్షల 45 వేల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీలో క్వశ్చన్ అవర్ సందర్భంగా ఆరోగ్యశ్రీ బకాయిలు, సేవలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన వివరణాత్మక సమాధానం ఇచ్చారు. గతంలో ఏడాదికి సగటున 2.5 లక్షల మందికి మాత్రమే సేవలు అందగా, ప్రస్తుతం ఆ సంఖ్య 4 లక్షలకు చేరిందని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లింపులను భారీగా పెంచిందని, గత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున రూ.52 కోట్లు చెల్లిస్తే, ప్రస్తుతం నెలకు రూ.89 కోట్లు రెగ్యులర్‌గా చెల్లిస్తున్నామని మంత్రి వెల్లడించారు.
గత ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.600 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు, రూ.130 కోట్ల ఈహెచ్ఎస్ బకాయిలను కూడా క్రమంగా తగ్గిస్తూ వస్తున్నామని మంత్రి తెలిపారు. 2023 డిసెంబర్ 8 నుంచి ఇప్పటివరకు సుమారు రూ.2400 కోట్లకు పైగా పేమెంట్స్ చేశామని, ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రులకు కేవలం రూ.250 కోట్ల బకాయిలు మాత్రమే ఉన్నాయని వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలకు నిరాకరిస్తున్నాయన్న ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన ఖండించారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి 330గా ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య ఇప్పుడు 537కు పెరగడమే తమ పనితీరుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ములుగు, నారాయణపేట వంటి మారుమూల జిల్లాల్లోనూ ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు.

# వారణాసి ప్రపంచం





అగ్ర దర్శకుడు రాజమౌళి సినిమా అంటేనే భారీ హంగులకు పెట్టింది పేరు. కథా ప్రపంచాన్ని ఆయన అత్యంత సహజంగా తెరపైన ఆవిష్కరిస్తూ ప్రేక్షకుల్ని లీనం చేస్తుంటారు. అందుకోసం నిర్మించే సెట్స్, విజువల్స్ విషయంలో ఏమాత్రం రాజీపడరు. తన 'వారణాసి' సినిమా విషయంలోనూ ఆయన పంథానే అనుసరిస్తున్నారు. 'వారణాసి' కథ సాగే ప్రాచీన కాశీ నగరాన్ని పునః సృష్టించి చిత్రీకరణ చేస్తున్నారు. హైదరాబాద్‌లో దాదాపు 9 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన కాశీనగరం సెట్స్‌కి సంబంధించిన చిత్రాల్ని చిత్రబృందం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ప్రొడక్షన్ డిజైనర్ బింగి నేతృత్వంలో ఈ సెట్స్‌ని తీర్చిదిద్దారు. పురాతన శిల్ప సౌందర్యం, కాశీ నగర వీధులు, నదీతీరం... ఇలా కాశీలో కనిపించే ప్రధాన ప్రాంతాలన్నిటికీ ఈ సెట్‌లో చోటు కల్పిస్తూ నిర్మించారు. పలు యుగాలతో ముడిపడిన కథ ఇది. అందుకు తగ్గట్టుగానే సెట్స్‌ని నిర్మించినట్టు తెలుస్తోంది. మహేశ్‌బాబు కథానాయకుడిగా... రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడి పాత్రని పోషిస్తున్నారు. కె.ఎల్.నారాయణ, ఎస్.ఎస్.కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. మోషన్ కేప్చర్ టెక్నాలజీతో సినిమాలోని కీలకమైన ఓ యాక్షన్ సన్నివేశాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో మహేశ్... రుద్ర అనే ఓ బౌంటీ హంటర్‌గా, శ్రీరాముడిగా రెండు పాత్రల్లో నటిస్తున్నారు. భారీ వ్యయంతో, ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# రామ్ చరణ్ కంటికి సర్జరీ.. చిరు పోస్ట్



రామ్ చరణ్ 'పెద్ది' షూటింగ్‌లో గాయపడిన విషయం తెలిసిందే. ఆయన కంటికి చిన్న సర్జరీ జరిగినట్లు చిరంజీవి సోషల్ మీడియాలో వెల్లడించారు. చరణ్‌కు సర్జరీ చేసిన వైద్యులకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.
సర్జరీ గురించి చిరంజీవి స్పందిస్తూ.. "చరణ్ కనురెప్పకు మీరు సరైన సమయంలో, ఎంతో నైపుణ్యంతో సర్జరీ చేసినందుకు ధన్యవాదాలు. మొదట మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ, మీ మాటలు భయాన్ని పోగొట్టి ధైర్యాన్నిచ్చాయి" అని పేర్కొన్నారు. చికిత్స అందించిన వైద్యులకు తమ కుటుంబం ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటుందని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ వార్త తెలుసుకున్న అభిమానులు రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్‌లో చిత్రీకరణ జరగుతున్న సమయంలో చరణ్ కంటికి గాయమైంది. కొన్ని రోజుల విశ్రాంతి అనంతరం చరణ్ మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారు. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూరుస్తున్నారు. ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది.

# అనిల్ రావిపూడి చిత్రంలో కృతిశెట్టి ?



వచ్చే సంక్రాంతి లక్ష్యంగా ఓ మల్టీస్టారర్ సినిమా సిద్ధమవుతోంది. సంక్రాంతి సినిమాల దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించనున్నారు. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కథానాయకులుగా నటించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా అధికారికంగా ఖరారైంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులతోపాటు, నటీనటుల ఎంపిక జరుగుతోంది. ఇందులో కథానాయికలుగా నటించేది ఎవరన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఓ కథానాయిక పాత్ర కోసం చిత్రబృందం ఇటీవల కీర్తి సురేశ్‌ని సంప్రదించినట్టు తెలిసింది. తాజాగా మరో పాత్ర విషయంలో కృతిశెట్టి పేరు వినిపిస్తోంది. ఈ వేసవిలోనే పట్టాలెక్కనున్న ఈ సినిమాలో పూర్తిస్థాయి తారాగణంపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఈ సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించిన 'మన శంకరవరప్రసాద్‌గారు' తర్వాత అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రమిది.

# బాలకృష్ణకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



భారతీయ చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. బుధవారం సాయంత్రం దేశ రాజధానిలో ఘనంగా ప్రారంభమైన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ దిల్లీ 2026' వేడుకల్లో ఆయనకు ప్రతిష్టాత్మక 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' (జీవితకాల సాఫల్య) పురస్కారాన్ని అందజేశారు. దశాబ్దాలుగా సినిమా రంగానికి ఆయన చేసిన విశేష కృషిని గుర్తిస్తూ నిర్వాహకులు ఈ అవార్డుతో సత్కరించారు.
దిల్లీలోని 'భారత్ మండపం' ఈ మెగా ఈవెంట్‌కు వేదికైంది. ముఖ్యమంత్రి రేఖా గుప్తాతో పాటు మంత్రులు కపిల్ మిశ్రా, పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ, నటీమణులు హేమమాలిని, కంగనా రనౌత్, షర్మిలా ఠాగూర్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఉత్సవాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ వేడుకల్లో బాలకృష్ణతో పాటు ప్రముఖ అలనాటి నటి షర్మిలా ఠాగూర్, దివంగత లెజెండరీ నటుడు ధర్మేంద్ర (ఆయన తరఫున కుటుంబసభ్యులు)ను కూడా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో గౌరవించారు. ముఖ్యమంత్రి రేఖాగుప్తా చేతులమీదుగా వీరంతా అవార్డులు అందుకొన్నారు.
ఈ సందర్భంగా షర్మిలా ఠాగూర్ మాట్లాడుతూ.. వయసు పెరిగేకొద్దీ నటనలో మరింత స్వేచ్ఛ లభిస్తుందన్నారు. దిల్లీ పర్యాటక, రవాణా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ చలనచిత్ర ఉత్సవాలు మార్చి 31 వరకు కొనసాగనున్నాయి. వివిధ భాషా చిత్రాలను ఈ వేడుకలో ప్రదర్శించనున్నారు.

# 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు'.. ఆ రోల్ మిస్ అయిన రాజశేఖర్



టాలీవుడ్ మల్టీస్టారర్ సినిమాల్లో ఎవర్‌గ్రీన్ 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' . పెద్దోడు- చిన్నోడుగా వెంకటేశ్- మహేశ్‌బాబు ఎంతగా అలరించారో.. వాళ్ల తండ్రి పాత్రలో ప్రకాశ్‌రాజ్ అంతగా ఆకట్టుకున్నారు. ఏం జరిగినా అంతా మనమంచికే అన్నట్లు వ్యవహరించే ఈ రేలంగి మామయ్య పాత్ర కోసం ముందుగా రాజశేఖర్ ను అనుకున్నారు మేకర్స్. కానీ, అనివార్య కారణాల వల్ల ఆయన నటించలేక పోయారు. స్వయంగా ఆయనే ఓ ఇంటర్వ్యూలో ఈ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు.
"సీతమ్మ వాకిట్లో..'లో ఎప్పుడూ నవ్వుతూ ఉండే క్యారెక్టర్ కోసం మేకర్స్ నన్ను సంప్రదించారు. నా నవ్వు బాగుంటుందన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఆ రోల్ నేను చేస్తే బాగుంటుందని అడిగారు. కానీ చేయలేకపోయా" అని తెలిపారు. నటించనందుకు ఎప్పుడైనా ఫీల్ అయ్యారా? అని అడగ్గా.. అలాంటిదేం లేదన్నారు. తనకు డ్యాన్స్ చేయడం ఇష్టం ఉండేది కాదని, అందుకే కెరీర్ ప్రారంభంలో కష్టపడాల్సి వచ్చేదని అన్నారు. అలా చేస్తూ ఉండగా కొన్నాళ్లకు డ్యాన్స్ అలవాటు అయిందని చెప్పారు.
తనకు గోలీల ఫ్యాక్టరీ ఉందంటూ వచ్చిన రూమర్స్‌పై నవ్వుతూ స్పందించారు. "దాని ద్వారా నెలకు రూ.3 కోట్లు సంపాదిస్తున్నానట. ఎందరికో ఉపాధి కల్పిస్తున్నానని అన్నారు. ఇంతకీ అదెక్కడ ఉందో తెలిస్తే బాగుంటుంది. ఈ వార్తలు చూసిన ఎంతోమంది కాల్ చేసిన నిజంగానే మీకు గోలీల ఫ్యాక్టరీ ఉందా? అని అడిగారు" అని చెప్పారు. ప్రస్తుతం 'బైకర్' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారాయన. ఈ మూవీలో హీరో శర్వానంద్‌కు తండ్రిగా నటించారు. అభిలాష్‌రెడ్డి దర్శకత్వం వహించిన స్పోర్ట్స్ యాక్షన్ మూవీ ఇది. ఏప్రిల్ 3న విడుదల కానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS,6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL,TELANGANA-506001.PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com